క్లుప్తంగా

లోక్ అదాలత్‌తో సత్వరం కేసుల పరిష్కారం



మాట్లాడుతున్న శాశ్వత లోక్ అదాలత్ చైర్‌పర్సన్ మేరీ గ్రేస్ కుమారి

పెదవేగి : ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రజా ప్రయోజిత సేవల శాశ్వత లోక్ అదాలత్ చైర్పర్సన్ ఏ.మేరీ గ్రేస్ కుమారి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా మంగళవారం పెదవేగి మండలం పినకడిమిలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ ఎ.మేరీ గ్రేస్‌కుమారి మాట్లాడుతూ కక్షిదారులకు సత్వర కేసుల పరిష్కారం నిమిత్తం, ఉచిత న్యాయ సహాయం అందించటం, చట్టాలపైన అవగాహన కల్పించడం కోసం లీగల్ సర్వీసెస్ అథారిటీ చట్టం రూపొందించారని చెప్పారు. ఈ చట్టంలో భాగంగా శాశ్వత లోక్ అదాలత్ ఏర్పాటు చేశారని తెలిపారు. ఈ శాశ్వత లోక్ అదాలత్‌లో ఇచ్చే తీర్పులకు అప్పీలు ఉండదని, ఎటువంటి రుసుమును చెల్లించాల్సిన అవసరం లేదని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పలగాని సునీత, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు, వలంటీర్లు పాల్గొన్నారు.

చదువులో రాణించాలి



విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేస్తున్న డీఈఓ పీ శ్యామ్ సుందర్

పెదపాడు : బాలికలు బాగా చదువుకుని ఉన్నత స్థాయికి వెళ్లాలని ఏలూరు జిల్లా విద్యాశాఖాధికారి పీ శ్యామ్ సుందర్ తెలిపారు. పెదపాడు మండలంలోని కలపర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ పాఠశాలలో స్థానికులు పామిరెడ్డి సూరారెడ్డి విద్యార్థులకు అందించిన యూనిఫాంను మంగళవారం పంపిణీ చేసారు. ఈ సందర్భంగా పామిరెడ్డి సూరారెడ్డి దాతృత్వాన్ని కొనియాడారు. హెచ్‌ఎం కే భీమయ్య, సమగ్ర శిక్షా సీఎంఓ రవీంద్ర, ఏఎల్ఎస్ కోఆర్డినేటర్ జీ రాధాకృష్ణ పాల్గొన్నారు.

అనారోగ్యం కారణంగా చంద్రబాబుకు బెయిలు

భీమడోలు: స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబుకు వచ్చింది కేవలం మధ్యంతర బెయిల్ మాత్రమే అని, నాలుగు వారాల తర్వాత మరలా జైలు వెళ్లడం ఖాయమని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి ముళ్లగిరి జాన్సన్ అన్నారు. భీమడోలులో మంగళవారం ఆయన మాట్లాడుతూ చంద్రబాబుకు అనారోగ్య సమస్యల కారణంగా కోర్టు నాలుగు వారాల పాటు మధ్యంతర బెయిల్ ఇచ్చిందన్న విషయాన్ని టీడీపీ నాయకులు మరవవద్దన్నారు. ప్రజల కష్టాలను తెలుసుకున్న నాయకుడే ప్రజానాయకుడన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావడం ఖాయమన్నారు.

జగనన్న కాలనీలో విద్యుత్ సౌకర్యం

దెందులూరు: దెందులూరు జగనన్న కాలనీలో విద్యుత్ శాఖ ఈఏ ఉషారాణి, సబ్ ఇంజనీర్ శ్రీను, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస చౌదరి సహకారంతో మంగళవారం స్తంభాలకు తీగలు, లైట్లు ఏర్పాటు చేసినట్టు వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి కట్టా ఏసుబాబు అన్నారు. జగనన్న కాలనీ లబ్ధిదారులు ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, విద్యుత్ శాఖాధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

గుండుగొలనులో జ్వరాల సర్వే

భీమడోలు: సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలున్నందున ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని గుండుగొలను సర్పంచ్ కె.లక్ష్మీ రాజ్‌కుమార్ అన్నారు. గుండుగొలనులో మంగళవారం వైద్య ఆరోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో ఇంటింటా జ్వరాల సర్వే కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ పురవీధుల్లో వైరల్ వ్యాధులపై అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అసిస్టెంట్ మలేరియా అధికారి జే.గోవిందరావు మాట్లాడుతూ ఎవరికైనా జ్వరం వస్తే అశ్రద్ధ వహించవద్దన్నారు. మురికి కాలువల్లో రసాయనాలు పిచికారీ చేసారు. హెల్త్ సూపర్‌వైజర్ రామకృష్ణ, అసిస్టెంట్లు రమేష్, రాజు, శ్రీనివాస్, ఏఎంఎస్‌లు నాగమణి, రత్నకుమారి, పూర్ణ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆశాజనకంగా దిగుబడి

భీమడోలు: సార్వా పంట దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయని మండల వ్యవసాయాధికారిణి ఎస్‌పీపీ ఉషారాణి అన్నారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో దుద్దేపూడి ఆర్‌బీకే పరిధిలోని కోడూరుపాడులో మంగళవారం ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతు ఈగలపాటి రవి వరి క్షేత్రంలో నిర్వహించిన పంట కోత ప్రయోగంలో 14.3 కేజీల దిగుబడి రాగా ఎకరాకు 30 బస్తాల దిగుబడి వస్తున్నట్లు అధికారులు నిర్ధారించారు. ఈ సందర్భంగా ఏవో ఎస్‌పీపీ ఉషారాణి మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 13,486 ఎకరాల్లో సార్వా సాగు చేశారన్నారు. సార్వా సీజన్‌లో వాతావరణం అనుకూలతతో ఆశాజనక దిగుబడి వచ్చిందన్నారు. మండల వ్యాప్తంగా ఇప్పటి వరకు 87 ఎకరాల్లో వరి కోతలు పూర్తయ్యాయని తెలిపారు. వీఏఏ ఆదిత్య, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం ప్రాధాన్యత

- జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు విజయవంతం
- ముగింపు శిబిరంలో ఎమ్మెల్యే వాసుబాబు



ఉంగుటూరు: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాసుబాబు



పెదవేగి: మందుల కిట్లు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు

ఉంగుటూరు: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు విజయవంతం అయ్యాయని, ప్రజలు సద్వినియోగం చేసుకున్నారని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. ఉంగుటూరులో జగనన్న ఉచిత వైద్య శిబిరం మంగళవారం నిర్వహించారు. ఈ శిబిరంలో పాల్గొన్న వాసుబాబు మాట్లాడుతూ నెలరోజులు నిర్విరామంగా నిర్వహించిన వైద్య శిబిరాలను 8,750 మంది సద్వినియోగం చేసుకున్నారని అన్నారు. 125 మందిని ఇతర ఆసుపత్రులకు సిఫారసు చేసినట్టు వెల్లడించారు. మహిళలు పెద్ద సంఖ్యలో ఈవైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకున్నారని వివరించారు. 172 రకాల మందులను ఈ శిబిరాల్లో రోగులకు పంపిణీ చేసినట్టు తెలిపారు. వైద్యరంగానికి సీఎం జగన్ అధిక ప్రాధాన్యతనిస్తూ ప్రజల ఆరోగ్యానికి భద్రత కల్పిస్తున్నారని అన్నారు. జనవరిలో లబ్ధిదారులకు రూ.3 వేల పెన్షన్ అందించనున్నారని తెలిపారు. డీసీఎంఎస్ జిల్లా చైర్మన్ వేండ్ర వెంకటస్వామి మాట్లాడుతూ సీఎం జగన్ పేదల పక్షపాతి అని, నాలుగేళ్ల పాలనలో రూ.3 లక్షల కోట్లు నేరుగా పథకాల లబ్ధిదారుల ఖాతాలో జమ చేశారని అన్నారు. సమావేశానికి సచివాలయాల మండల కన్వీనర్ పెనుగొండ బాలకృష్ణ అధ్యక్షత వహించారు. వైఎస్సార్ సీపీ వీవర్స్ జిల్లా అధ్యక్షుడు దొంతంశెట్టి సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు సందక రాంబాబు, ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, మండల అధ్యక్షుడు మరడ మంగరావు, జెడ్పీటీసీ కొరిపల్లి జయలక్ష్మి, తహసీల్దారు వెంకటరమణ, ఎంపీడీవో ప్రేమాన్విత, పంచాయతీ రాజ్ జిల్లా అధ్యక్షుడు పుప్పాల గోపి వేదికను అలంకరించారు. ఈ శిబిరంలో ఆర్థో స్పెషలిస్టు భానుప్రకాష్, చిల్డ్రన్ స్పెషలిస్టు ప్రియదర్శిని, కంటి వైద్య నిపుణులు స్మృతి, డాక్టర్ శ్రావణ్‌రెడ్డి, డా.మానస వైద్యసేవలు అందించారు. పెద్ద సంఖ్యలో రోగులు హాజరయ్యారు. వృద్ధులను, దివ్యాంగులు వలంటీర్ల సాయంతో శిబిరంలో వైద్యసేవలు పొందారు.

ప్రజల ఆరోగ్యంపై సీఎం ప్రత్యేక శ్రద్ధ

పెదవేగి : ప్రజల ఆరోగ్య పరిరక్షణ జగనన్న ప్రభుత్వ లక్ష్యమని విజయరాయి సర్పంచ్ గొట్టాపు కృష్ణవేణి అన్నారు. పెదవేగి మండలం విజయరాయి గ్రామ సచివాలయం పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం స్థానిక సర్పంచ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కృష్ణవేణి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల ప్రజలకు కార్పొరేట్ స్థాయిలో మెరుగైన వైద్య సేవలు అందించి పూర్తిస్థాయి ఆరోగ్యాన్ని అందించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పంతో జగనన్న సురక్ష పథకం ఉద్దేశమని తెలిపారు. వివిధ సమస్యలతో వైద్యుల వద్దకు వచ్చిన వారిని ప్రజాప్రతినిధులు దగ్గరుండి వైద్యసేవలను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఐసీడీఎస్ బృందం ఏర్పాటు చేసిన స్టాల్స్‌లోని పౌష్టికాహార వంట పదార్థాలను ప్రజాప్రతినిధులు అధికారులు, రుచిచూసి, అభినందించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్ నాగరాజు, ఎంఈఓ అరుణ్‌కుమార్, నాయకులు బొమ్మారెడ్డి రామచంద్రారెడ్డి, గొట్టాపు నాగేంద్ర, ఉపసర్పంచ్ లేగల శివ, పులగం వేణుగోపాల్‌రెడ్డి, ఆళ్ళ చంద్రశేఖరరెడ్డి, రెడ్డెం శ్రీనివాసరెడ్డి, ఉన్నత పాఠశాల చైర్మన్ బైగాని రంగారావు, విజయరాయి సొసైటీ చైర్ పర్సన్ పాలడుగు పెదబాబు, మండల తహసీల్దార్.ఎస్ నాగరాజు, ఈఓఅండ్ పీఆర్డీ పి. శ్రీనివాసులు, వైద్యాధికారులు. ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

డిసెంబర్‌లోగా పనులు పూర్తి చేయాలి



పనులపై సమీక్షిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ, ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

ఏలూరు(మెట్రో): జెడ్పీ నిధులతో దెందులూరు నియోజకవర్గంలో చేపట్టిన పనులను డిసెంబర్ లోగా పూర్తిచేయాలని జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక జెడ్పీ కార్యాలయంలో పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం ద్వారా దెందులూరు నియోజకవర్గంలో చేపట్టిన పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో రూ.36.66 కోట్లతో చేపట్టిన 12 పనులను సత్వరమే పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. జెడ్పీ నిధులతో దెందులూరు నియోజకవర్గంలో చేపట్టిన పనులను డిసెంబర్ నెలాఖరులోగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. పంచాయతీరాజ్ పర్యవేక్షక ఇంజినీర్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు డివిజనల్ ఇంజినీర్లు పాల్గొన్నారు.

ప్రజలకు ఉచిత వైద్య సేవలు సంతృప్తికరం



వెల్‌నెస్ కేంద్రంలో వైద్య సేవల వివరాలను బృందం సభ్యులకు వివరిస్తున్న ఎంఎల్‌హెచ్‌పీ నాగదుర్గ

భీమడోలు: రాష్ట్ర ప్రభుత్వం ఆధీనంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు అందుతున్న ఆరోగ్య సేవలు సంతృప్తికరంగా ఉన్నాయని జాతీయ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్స్ (జాతీయ నాణ్యతా హామీ ప్రమాణాలు) బృందం సభ్యులు పేర్కొన్నారు. గుండుగొలను పీహెచ్‌సీ పరిధిలోని భీమడోలు–1 సచివాలయంలోని వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ కేంద్రాన్ని మంగళవారం పశ్చిమబెంగాల్‌కు చెందిన జాతీయ బృందం సభ్యులు నిర్మల్ రాయ్, కపిల్ ఆగర్వాల్ సందర్శించారు. ఇద్దరు సభ్యుల బృందం, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎం, సీహెచ్‌వోలకు సంబంధించి రికార్డులు, రిజిస్టర్లను వారి పరిశీలించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వైద్య ఆరోగ్య సేవలు సక్రమంగా సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. సేవలందుకుంటున్న రోగుల నుంచి ఆరోగ్య సేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వైద్య సేవల వివరాలు సచివాలయాల పరిధిలో విలేజ్ హెల్త్ క్లినిక్ కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజల చెంతకే వైద్య సేవలందించడం చాలా సంతోషంగా ఉందన్నారు. విలేజ్ క్లినిక్‌లో ఉంచిన వైద్య సేవల ఛార్ట్‌ను సభ్యుడు నిర్మల్‌రాయ్ ఆసక్తిగా తిలకరించారు. ప్రజలకు వివిధ ఆరోగ్య సేవలు ఏ స్థాయిలో అందుతున్నదీ తెలుసుకునేందుకు, మరింత పటిష్టం చేయడానికి, భవిష్యత్తు ప్రణాళికలు రూపొందించేందుకు ఈ సందర్శన ప్రధాన ఉద్దేశ్యమన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో ఓ.అన్నపూర్ణ, పీహెచ్‌సీ సూపర్‌వైజర్లు కె.మల్లేశ్వరి, షేక్ నవీనా, ఎంఎల్‌హెచ్‌పీ నాగదుర్గ, సిబ్బంది చంద్రకళ, టి.మురళీకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయాలి




అభివృద్ధి పనులపై ప్రజాప్రతినిధులు, అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు

గణపవరం: గణపవరం మండలంలోని వివిధ గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని, నిధులు అందుబాటులో ఉన్నప్పటికీ పనుల్లో జాప్యం తగదని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గణపవరం మండలానికి చెందిన అభివృద్ధి పనుల ప్రగతిపై మండల అధికారులు, ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యులు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, కాంట్రాక్టర్లతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామాల వారీగా పనుల పురోగతిపై ఆరా తీశారు. సచివాలయ భవనాలు దాదాపు పూర్తయ్యాయని ఎంపీడీవో జ్యోతిర్మయి, మండల ఇంజనీరింగ్ అధికారులు వివరించారు. ఆర్‌బీకే భవనాలు, విలేజ్ వెల్‌నెస్ కేంద్రాలు, గ్రంథాలయాల నిర్మాణ పనులు వివిధ దశలలో ఉన్నాయని అధికారులు వివరించారు. డిసెంబర్ నెలాఖరు నాటికి మొత్తం నిర్మాణ పనులు పూర్తయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఒక్కో సచివాలయం పరిధిలో పనులకు రూ.30 లక్షల చొప్పున ప్రభుత్వం మంజూరు చేసిందని, ఆ నిధులతో నిర్మించే డ్రెయినేజీలు, సీసీ రోడ్ల నిర్మాణాలపై ఎమ్మెల్యే ఆరా తీశారు. ఈ సమీక్షలో గణపవరం ఎంపీపీ అర్ధవరం రాము, జెడ్పీటీసీ సభ్యురాలు దేవారపు సోమలక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దండు రాము, సర్పంచ్‌లు ఎంపీటీసీ సభ్యులు, పార్టీ గ్రామ కన్వీనర్లు పాల్గొన్నారు.

రేషన్ డీలర్లు మెరుగైన సేవలందించాలి

దెందులూరు: గ్రామాల్లో రేషన్ డీలర్లు, వ్యాన్ ఆపరేటర్లు సమన్వయం, ప్రణాళికతో నిత్యావసర సరుకుల పంపిణీలో విమర్శలకు తావివ్వకుండా మెరుగైన సేవలందించాలని దెందులూరు తహసీల్దార్ ఎన్‌వీ నాంచారయ్య అన్నారు. మంగళవారం మండల సివిల్ సప్లయ్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కృష్ణస్వామి అధ్యక్షతన మండల రేషన్ డీలర్ల సమావేశం నిర్వహించారు. సమావేశంలో రేషన్‌డీలర్ల జిల్లా అధ్యక్షులు తలారి రామకృష్ణ మాట్లాడుతూ విధి నిర్వహణలో రేషన్ డీలర్లు నూరు శాతం సేవా భావంతో పనిచేస్తున్నారని, శాఖాపరమైన సమస్యల పరిష్కారానికి రాష్ట్ర, జిల్లా స్థాయిలో సహాయసహకారాలు అందించాలన్నారు. పెండింగ్ సమస్యల పరిష్కారానికి అధికారులు తమ వంతు కృషి చేయాలన్నారు. అనంతరం గ్రామాల వారీగా తహసీల్దార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సమీక్ష నిర్వహించారు.

అభ్యసనా సామర్థ్యాలను మెరుగుపర్చేందుకు పరీక్షలు



భీమడోలులో మాట్లాడుతున్న ఎంఈవో ఈదుపల్లి శ్రీనివాసరావు, చిత్రంలో ఎంఈవో–2 భాస్కర్

భీమడోలు: విద్యార్థుల్లోని అభ్యసనా సామర్థ్యాలను మరింత మెరుగుపర్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని భీమడోలు ఎంఈవో 1, 2 ఈదుపల్లి శ్రీనివాసరావు, అయినపర్తి భాస్కర్ అన్నారు. భీమడోలులోని శ్రీవేంకటేశ్వర జూనియర్ కళాశాలలో మంగళవారం ఈనెల 3న దేశ వ్యాప్తంగా నిర్వహించనున్న రాష్ట్ర విద్యా సాఫల్య సర్వే (ఏచీమెంట్ సర్వే) పరీక్షపై ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల హెచ్‌ఎంలు, కళాశాల విద్యార్థులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంఈవో–1 ఈదుపల్లి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఎంఈవో–2 భాస్కర్ పరీక్ష నిర్వహణ అమలు తీరుపై వారికి దిశానిర్దేశం చేసారు. వారు మాట్లాడుతూ విద్యా వ్యవస్థలోని లోటుపాట్లను గుర్తించి గుణాత్మక బోధనతో అభ్యసనా లక్ష్యాలను సాధించేలా ప్రణాళికలను దేశస్థాయిలో సిద్ధం చేస్తున్నట్టు తెలిపారు. విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు ఈ తరహా పరీక్షలు అవసరమని నిపుణులు గుర్తించారన్నారు. ప్రతి విద్యార్థి ఇంగ్లీషు మీడియంలోనే పరీక్షలు రాయాల్సి ఉంటుందన్నారు. మండల వ్యాప్తంగా 44 తరగతుల్లో చదువుకుంటున్న 3,6,9 తరగతులకు చెందిన 1,028 మంది పరీక్షలు రాస్తారన్నారు. వారికి తర్ఫీదును అందించాల్సిన బాధ్యత హెచ్‌ఎం, ఉపాధ్యాయులపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు చెందిన హెచ్‌ఎంలు, సీఆర్‌ఎంటీలు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ సమైక్యతకు పటేల్ కృషి



గణపవరం పంచాయతీ వద్ద ఐక్యతా ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు సిబ్బంది



పెదపాడులో మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు ఉపాధ్యాయులు

గణపవరం: భారతదేశాన్ని ఏకతాటిపై నిలిపి ఐక్యంగా ఉంచేందుకు సర్దార్ వల్లభాయ్ పటేల్ చేసిన కృషి దేశం యావత్తూ గుర్తుంచుకుంటుందని గణపవరం సర్పంచ్ మూర అలంకారం, ఉపసర్పంచ్ దండు రాము అన్నారు. పటేల్ జయంతి సందర్భంగా మంగళవారం పంచాయతీ కార్యాలయం వద్ద పటేల్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది ఐక్యతా ప్రతిజ్ఞ చేశారు. పంచాయతీ కార్యదర్శి డి.ఎస్.ఆర్ ప్రసాద్ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రీయ ఏక్తా దివస్ ర్యాలీ

పెదపాడు: విద్యార్థులు జాతీయ ఐక్యతను పెంపొందించేందుకు కృషి చేయాలని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పీ వెంకటేశ్వరరావు తెలిపారు. రాష్ట్రీయ ఏక్తా దివస్ సందర్భంగా పెదపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రధాన రహదారిపై మంగళవారం ర్యాలీ నిర్వహించారు. పెదపాడు బళ్లారెవు తూము సెంటర్‌లో ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించిన అనంతరం ప్రతిజ్ఞ చేసారు.

దెందులూరులో ర్యాలీలు

దెందులూరు: భారతరత్న, స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి పురస్కరించుకుని జాతీయ ఐక్యత దినోత్సవం గ్రామగ్రామాన మంగళవారం నిర్వహించారు. దెందులూరులో సెయింట్ మెరిస్ యూపీ పాఠశాలలో కరస్పాండెంట్ సిస్టర్ విన్సీ మరియా, ఎడ్యుకేషనల్ కౌన్సిలర్ సిస్టర్ జూలిట్, ప్రిన్సిపల్ సిస్టర్ టీనా మరియా ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. ముప్పవరం సర్పంచ్ మెండేం సంతోష్‌కుమార్ అధ్యక్షతన వల్లభాయ్ పటేల్ జయంతిని ఘనంగా నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నేటి తరానికి స్ఫూర్తి సర్దార్ వల్లభాయ్ పటేల్

భీమడోలు: జాతీయ సమైక్యత, సమగ్రతకు పాటుపడిన మహనీయుడు, దేశ ఉప ప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పలువురు వక్తలు అన్నారు. అన్నేవారిగూడెం, భీమడోలు, పాతూరు, గుండుగొలనులో ప్రభుత్వ పాఠశాలలు, శాఖా గ్రంథాలయాల్లో ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ 149వ జయంతిని పురస్కరించుకుని మంగళవారం జాతీయ ఐక్యత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. దివంగత పీఎం ఇందిరాగాంధీ వర్ధంతి సందర్భంగా జాతీయ సమగ్రత దినోత్సవం నిర్వహించారు. భీమడోలు శాఖా గ్రంథాలయంలో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్ తదితరులు పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాఠశాలల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో వల్లభాయ్ పటేల్‌కు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు ర్యాలీలు, ఐక్యతా దివస్ ప్రతిజ్ఞ చేసారు. ఈ కార్యక్రమాల్లో పీసీ కమిటీ చైర్మన్ షేక్ బీబీ పటేల్, హెచ్‌ఎం షేక్ మస్తాన్, నిర్మలకుమారి, గ్రంథపాలకులు కె.శ్రీనివాస్, డీఎస్‌బీ అమర్‌నాథ్, జి.నాగమణి, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏపూరులో పటేల్ జయంతి

పెదపాడు: ఏపూరులో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఏపూరు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద పటేల్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి ఎస్‌వీ శివయ్య, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కొఠారును కలిసిన పెదవేగి సీఐ శ్రీనివాస్



ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరిని కలిసిన సీఐ శ్రీనివాస్

దెందులూరు: ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరిని మంగళవారం ఆయన కార్యాలయంలో పెదవేగి నూతన సీఐ కే.శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిశారు. పెదవేగి సీఐగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఎమ్మెల్యే కలిసినట్టు ఆయన తెలిపారు. సీఐ శ్రీనివాస్ పాలకొల్లు రూరల్ సీఐగా పనిచేస్తూ బదిలీపై పెదవేగి పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు.


వైభవంగా అయ్యప్ప స్వామి మహా పడి పూజ



పడిపూజ నిర్వహిస్తున్న గురుస్వాములు

నిడమర్రు: స్వామియే శరణం అయ్యప్ప.. అంటూ అయ్యప్ప మాలాధారులు నామస్మరణతో అడవికొలను గ్రామం మార్మోగింది. మంగళవారం గ్రామంలోని అయ్యప్పస్వామి దీక్షా పీఠం గురుస్వామి గోలి వీర వెంకట సత్యసూర్య శ్రీనివాసరావు (నాని) ఆధ్వర్యంలో మహా వైభవ పడి పూజ నిర్వహించారు. ఉదయం పండితులు మల్లెడుగుల అయ్యప్ప శర్మచే గణపతి హోమంతో ఈ పూజ ప్రారంభించారు. 369 కన్నెస్వాములు కలశాలతో చేసిన నగర సంకీర్తన, కలశపూజ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం యోగిని చంద్రకాళీప్రసాద మాతాజీ వారితో సత్‌సంగ కార్యక్రమం నిర్వహించారు. గురుస్వాములు సలాది శివస్వామి (రాజోలు), తోట శివగురుస్వామి పూజలు నిర్వహించారు. ఈ పూజకు జిల్లాలోని వివిధ అయ్యప్పస్వామి పీఠాల నుంచి 14,00 మంది మాలధారులు పాల్గొన్నారు. ఈ పూజల్లో ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏర్పాట్లును నిర్వాహకులు గోలి విశ్వేశ్వరరావు, పాపాయమ్మ దంపతులు పర్యవేక్షించారు.

కళాశాల విద్యార్థులకు పరుగు పోటీ



భీమడోలు కళాశాల వద్ద పరుగు పోటీలను ప్రారంభిస్తున్న ప్రిన్సిపల్ బి.రవికుమార్

భీమడోలు: యువత ఆరోగ్యంగా ఉంటేనే దేశం అభివృద్ధి చెందుతుందని భీమడోలు వేంకటేశ్వర జూనియర్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్స్ వి.నాగేశ్వరరావు, బొమ్ము రవికుమార్ అన్నారు. ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం పిలుపు మేరకు ఫిట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛతా ఫ్రీడమ్ రన్ 4.0 కార్యక్రమం మంగళవారం భీమడోలు శ్రీవేంకటేశ్వర జూనియర్, డిగ్రీ కళాశాలలలో నిర్వహించారు. జాతీయ సేవా పథకం విభాగాలకు చెందిన 100 మంది యువతీ యువకులు పరుగు పందెంలో పాల్గొన్నారు. అనంతరం విజేతలు బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు బి.శశికాంత్, జి.నాగరాజు, ఎన్‌సీసీ అధికారి కె.శివశంకర్, వైస్ ప్రిన్సిపల్ డీఎంబీబీ సింగ్, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి దాతల సహాయం అభినందనీయం



కొవ్వలి పాఠశాలలో విద్యార్థులకు క్యారియర్లు అందజేస్తున్న దృశ్యం

దెందులూరు: విద్యాభివృద్ధికి దాతలు సహాయం అభినందనీయమని పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు అన్నారు. డాక్టర్ కాటి గంగరాజు జ్ఞాపకార్థం వారి కుమారులు గోకరాజు మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ కాటి రమణరాజు సమకూర్చిన 50 మంది విద్యార్థులకు హాట్ క్యారియర్లు, పేద వృద్ధులకు దుప్పట్లను కొవ్వలి పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల వైస్ ఎంపీపీ గొల్ల నాగరాజు, పాఠశాల హెచ్‌ఎం దాసు, కాటి అర్జున్, కాటి మురళీ పాల్గొన్నారు. హెచ్‌ఎం రాజు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో వైస్ ఎంపీపీ గొల్ల నాగరాజు మాట్లాడుతూ దాత, వైద్యుడు కాటి రమణరాజు దశాబ్దాలుగా కొవ్వలిలో వైద్యసేవలందిచడంతోపాటు, విద్యార్థులకు, వృద్ధులకు ఆర్థికంగా సేవలందించడం స్ఫూర్తిదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో కమ్ముల వెంకటేశ్వరరావు, సీహెచ్‌వీ రాజు, కాటి బాబు, స్వరూపారాణి, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.